తత్వ సందేశము

"బ్రహ్మర్షి" డా॥ ఉమర్ ఆలీషా కవి కృతసంహిత

శ్రీ విశ్వవిజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠము
పిఠాపురం - 533 450
తూర్పు గోదావరి జిల్లా

ముల్యము : రూ. 40.00

ప్రథమ ముద్రణ 1952
ద్వితీయ ముద్రణ 1979
తృతీయ ముద్రణ 1991
చతుర్థ ముద్రణ 1996
పంచమ ముద్రణ 2001

ముద్రణ :
స్వామి ఆఫ్‌సెట్ ప్రింటర్స్
పిఠాపురం - 533 450

వలయువారు :
శ్రీ ఉమర్ అలీషా గ్రంథమండలి
ఉమర్ అలీషా రోడ్
పిఠాపురం-533 450
తూ॥ గో॥ జిల్లా
Website : www.sriviswaviznanspiritual.org

పీఠిక

శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి జన్మతహ మహాతత్త్వవేత్త. వీరు శ్రీ మహర్షి మొహియద్దీన్ బాషాగారి అగ్రనందనులు. వరప్రసాది. వీరు బాల్యము నుండియే ధారాళమైన కవిత్వము చెప్పుచుండిరి. వీరు రచియించిన మొదటి గ్రంథము "బ్రహ్మవిద్యావిలాసము" అను తత్త్వగ్రంథము. ఇది వీరి 15వ ఏట వ్రాసిరి. తదుపరి తత్వముపై స్వర్గమాత, సూఫీవేదాంత దర్శము, సాధన పథము మున్నగు పెక్కు వేదాంత గ్రంథములు, అనేక గీతములు, కీర్తనలు వ్రాసిరి. వీరి పూర్వులు "జ్ఞానసభ" యను ఆధ్యాత్మిక విజ్ఞాన సంస్థకు గురువులై తత్వముపదేశించుచుండిరి.

వీరి తండ్రిగారి యనంతరము 1928వ సంవత్సరములో వీరు జ్ఞాన సభకు పీఠాధిపతియై పెక్కు తత్వగ్రంథములు వ్రాసిరి. కవిగారు తత్వ ప్రచారమునకై వెడలినప్పుడు శిష్యులకోరికపై కీర్తనలు వ్రాసి యిచ్చుచుండిరి. వీటిని సాధ్యమైనంతవరకు సేకరించి "తత్వసందేశము" అను పేరిట ప్రకటించినాము. ప్రబోధము, ప్రార్థనలు అనువచనములుకూడ అనుబంధముగా ప్రకటించినాము.

మదీ ఎన్ కబీర్ షా

వారణాసి సత్యనారాయణశాస్త్రి

కార్యదర్శులు

శ్రీ ఉమర్ ఆలీషాకవి గ్రంథ ప్రచురణ సంఘము.

పిఠాపురం

26-1-1952

పీఠాధిపతుల చరిత్ర

శ్రీ విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠమునకు పీఠాధిపతులలో ఆది పీఠాధిపతి 1472 సం॥లో భారతదేశమునకు వచ్చియున్నారు.

ఆదిలో ఈ పీఠము అరబ్బుదేశమున అందలి బాగ్దాదునుండి పారశీకదేశము, అక్కడనుండి భారతదేశమునకు వచ్చి ఢిల్లీ నగరమున నివసించి అక్కడ సర్మద్‌హుస్సేనీ (సర్మద్ షహీద్) పేరుగల తత్త్వవేత్తను బొరంగజేబు చంపించినప్పుడు వారి సమకాలికుడైన యీ పీఠాధిపతి తానేషా కాలమున హైదరాబాదు వచ్చి హైదరాబాదు నుండి యీ పీఠమునకు జాగీరొసంగిన కారణమున ఆంధ్రదేశము ప్రవేశించి పీఠికాపురమున నివాసముగా స్థిరపరచుకొన్న మొదటి పీఠాధిపతి మదీన్ కబీర్షా.

ఆ కాలమువారిచే యీ పీఠాధిపతి మదీనా నుండి వచ్చిన తత్త్వవేత్తయని పిలువబడినారు. ఈ పీఠాధిపతులు ఏ దేశములో నున్నప్పుడు ఆ దేశ భాషలలో, ఉత్కృష్టమైనదిన్నీ, గణనీయమైనదిన్నీ అయిన కవిత్వం చెప్పియున్నారు.

వీరు అరబ్బీ, పార్శీక భాషలలో తత్వము గూర్చి గ్రంధము వ్రాసినట్లు తెలియబడుచున్నది.

ఈ మదీన్ కబీర్షాగారిని తత్వ రూపులుగ గ్రహించుటకు ఆనాటి ప్రజలు వీరి మహత్మ్యము చూడగోరి బండ్లకొలది యిన్ధనంబులు కాల్చి అగ్ని గుండము యేర్పరచి వారిని అందు కూర్చుండమని కోరగా అప్పుడు ఆ అగ్ని గుండమున పూలపాన్పున గూర్చున్నట్లు గూర్చుండి తన మానసిక మహత్మ్యము ప్రజలకు జూపిరని వారి చరిత్ర.

వారి తరువాత వారి అగ్రనందనుడు ద్వితీయ పీఠాధిపతి మధార్షా. ఆ తరువాత వారి సుతులు తృతీయ పీఠాధిపతి "హసన్మియాషా వారి కుమారులు చతుర్థ పీఠాధిపతి కావొనేషావలి." వీరి సిస్సనాటి కాలమున బాల్యమందే వీరి

తండ్రి హసన్మియాషా దివంగతులైన కారణమున వారికి తిరుగ ఆఖైలలీషా గురువర్యులచేత యీ పీఠతత్వ స్వరూపమైన మహామంత్రము ప్రబోధింపబడి తిరుగ యీ పీఠము పున:స్థాపితమైనది.

శ్రీ కౌనేషావలీగారి చిన్ననాడు ఒకనాడు వారి దృశ్యములో నొక మహాపురుషుడు కనబడి దర్శనమిచ్చి మీ వంశమందు ఆధ్యాత్మికరూపమైన తత్వస్వరూపము పీఠాధిపత్యరూపంలో వెలార్చబడుచున్న విధానము మీకు ముందు మీ తండ్రిగారు పీఠాధిపతిగ నిర్వహించు కాలమున మీ బాల్యమునందే వారు నిర్వాణము పొందియుండుటచే, అది మృగ్యమౌ సమయము కలుగనున్నది, ఆ పీఠమునకు మీరు పీఠాధిపత్యాధికారము స్వీకరించవలసియున్నది. ఇప్పుడు నాచే మీకు యీ మహామంత్రము ప్రబోధింపబడి పునరుద్ధరణ కావలసియున్నది. కాబట్టి ఈ రహస్యము నాచేత తెలుపుకోవలసినదిగా చెప్పినట్లు, పైవిషయములు దృశ్యములో చెప్పిన విధానమున శ్రీ కౌనేషావలీగారు బడికిపోవు సమయాన యే మహాపురుషుడు దృశ్యములో తనతో ప్రసంగించెనో ఆ మహావ్యక్తి జాగ్రదావస్థలో యెదుటపడి యేవాక్కులైతే దృశ్యములో ఆయన నోట ధ్వనింపబడినవో, నదేతీరున ఆయనచే ఈ పీఠాధిపతులచే ప్రబోధింపబడు మహామంత్రము ఆనాడు కౌనేషావలీగారికి ప్రబోధింపబడినది. ఆయనే శ్రీ ఆఖైలలీషా గురువులు. వీరు ఆకల్పాంతము దాక యీ పీఠాధిపతులకు గురువుగ సంస్మరణీయులు.

ఆనాటి నుండి యీనాటివరకు యీ పీఠాధిపత్యము అవిచ్ఛిన్నముగ సాగుచున్నది.

వారి పీఠాధిపత్య కాలములో "కలికి భాగవతము" అనే గ్రంధము ఈశ్వర పరిణామము తెలుపు మహత్త్వములతో నిండిన తత్వము చెప్పబడినది.

ఆ తరువాత వారి అగ్రనందనులైన పంచమ పీఠాధిపతి మహర్షి శ్రీ మొహియద్దీన్ బాద్షా గురువర్యులు, తన స్వానుభవైక వేద్యమైన కీర్తనలు, పదములు "పరతత్వ కీర్తనలు" అనుగ్రంధముగ రచింపబడినది.

బ్రహ్మర్షి శ్రీ డా॥ ఉమర్ ఆలీషా

షష్ఠమ పీఠాధిపతి

శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి
జీవిత సంగ్రహము

శ్రీ ఉమర్ ఆలీషా మహాకవిగారు పీఠికాపురమున క్రీ.శ. 1885 వ సం॥లో జన్మించిరి. వీరి తండ్రిగారు మహర్షి మొహియద్దీన్ బాద్షా గురువర్యులు. వీరి జనని చాన్బియాంబ.

వీరి తండ్రిగారు అరబ్బీ, పారశీక, సంస్కృతాంధ్ర పండితులు. ఆధ్యాత్మిక విద్యాపీఠాచార్యులు, ఆత్మవిద్యాపారంగతులు. వీరి కుటుంబము పూర్వము నుండియు భాషాపాండిత్యమునకు, ఆధ్యాత్మిక విద్యా సంపత్తికిని ప్రఖ్యాతి గాంచినది. శ్రీ కవిగారు చిన్ననాడే సంస్కృతాంధ్రములు విశేషముగా నభ్యసించిరి తదుపరి అరబ్బీ పారశీ కాంగ్ల భాషలు నేర్చిరి. వీరు ఆంగ్లమున వ్రాయుట, మాట్లాడుట యెఱుంగుదురు కాని ఆంగ్ల పద్యకావ్యములందు నెంతమాత్రము వీరికి ప్రవేశము లేదు. వీరు సహజ కవులు. వీరి 14 వ వర్షమున తెనుగున ధారాళముగా కవిత్వము జెప్పిరి. వీరి 18 వ యేట "మణిమాల" యను నాటకము వ్రాసి అచ్చొత్తించిరి. అది షేక్స్పియర్ మహాకవి నాటకమువలె నున్నదని అప్పటి పత్రికలు కొనియాడినవి. వీరికనేకచోట్ల ఉద్యోగములిచ్చెదమని ఆహ్వానించినను వాటికంగీకరించక భాషాసేవ, దేశసేవజేయుచు తన జీవితమును గడిపిరి. వీరు 1934 వ సంవత్సరము డిశంబరు నెలలో అఖిల భారత శాసనసభకు సభ్యులైరి. ఆ పదవి వీరు అవతారము చాలించు వరకు నుండెను.

వీరికి International Academy of America వారు 1936 సంవత్సరమున Doctor of Literature బిరుద మొసగిరి. శ్రీ కవిగారు వంశపారంపర్యముగా వచ్చుచున్న ఆధ్యాత్మిక విద్యాపీఠమునకు ఆచార్యులై పదహారు వేల జనమును శిష్యులుగా నొనర్చిరి.

వీరి యౌగిక జ్ఞానమును కొనియాడుచు జ్ఞానసభాసభ్యులు వీరికి బ్రహ్మర్షి బిరుద మొసంగిరి. వీరి సతీమణి అగ్బరు బీబీగారు, వీరితో ఢిల్లీ నగరము వెళ్ళి ది. 5-4-35 తేదీని దివి నలంకరించిరి. ఆ దినమున ఢిల్లీ శాసన సభ మూయబడెను. వీరు గతించినప్పుడు వీరికి అయిదుగురు కుమారులు, యిరువురు కుమార్తెలు, పెక్కురు పౌత్రపౌత్రిక లుండిరి.

శ్రీ కవిగారి జీవిత చరిత్ర ప్రత్యేక పుస్తకముగా వ్రాయబడుచున్నది. వీరు రచించిన "సూఫీ వేదాంత గ్రంధ"మందు వీరి జీవితము సంగ్రహముగా నిట్లు వ్రాసిరి.

--- స్వీయము ---

క. ఆ మొహియద్దీన్ బాద్షా
నామ మహాయోగి కగ్రనందనుడను నా
నా మహితాగమ హిత వి
ద్యామతి "ఉగ్రమాలిషా" మహాకవి నేనున్

సీ. రచియించినాడ విభ్రాజిత దివ్య ప్ర
బంధముల్ పది కావ్య బంధములుగ
వ్రాసినాడను కల్పనాసక్త మతి పది
నాటకంబులను కర్నాటఫక్కి
కూర్చినాడను కళాకోవిదుల్ కొనియాడ
నవలలు పది నవ నవల లనగ
తెలిగించినాడ నుద్దీపితాఖండ పా
రసి కావ్యములు పది రసికులలర

తే. రసము పెంపార నవధాన క్రమములందు
ఆశువులయందు పాటలయందు కవిత
చెప్పినాడ నుపన్యాస సీమలెక్కి
యవని "ఉగ్రమాలిషాకవి" యనగ నేను.

ఉ. రాజుల జూచితిన్ సుకవిరాజుల నోర్చితి బేరు గ్రొయ్య రా
రాజుల నోలగంబుల విరాజితపండిత సత్కవీంద్ర వి
భ్రాజిత మౌలవీబిరుద పట్టము లందితి యూనివర్శిటిన్
దేజముమీఱ సభ్యుడయితిన్ మతబోధకుడైతి గ్రమ్మఱిన్.

ఉ. వ్యాసములున్ విమర్శనలు భావకవిత్వ రసైక చారు వి
న్యాసములున్ మతాంతర మహాపరివర్తన తత్త్వరూపకో
పాసనముల్ పురాణములు వ్రాసితి భారతభూమి నే నుప
న్యాసము లిచ్చుచున్ దిరిగినాడను "ఉగ్రలిషా" కవీంద్రుడన్.

ఉ. వేలురచించి విద్యలనుబెట్టి గడించితి పారతోషికా
ద్యాళిని వేయినూట పదియార్లను సింహతలాటముల్ మహా
భీలక సత్కళా కనక విశ్రుతముల్ జయభేరి గ్రొయ్య హిం
తాల వనీనటత్క కవి తండము లేమిటి లెక్కమాకడన్.

సీ. సాధించితిని యోగసాధనంబులు హిమా
గమ మెక్కి మతిని చక్కాడియాడి
బోధించితిని జ్ఞానసాధన క్రమములు
చెవినిల్లుగా జేసి చెప్పి చెప్పి
సవరించితిని పెద్దసారస్వతంబును
శబ్దశాస్త్రంబులు జదివిచదివి
చూపించితిని రాజ్యలోపంబు లాంగ్ల ప్ర
భుత్వంబు ముంగర మోపిమోపి

తే. ఇప్పుడప్పుడె నలువదియేండ్లపైన
దాటిపోయెను వయసు నీనాటికైన
శాంతి గలుగదు నీ కళాధ్వాంతమందు
జీవితము తెన్ను సుడిబోవు నావబోలు.

మ. నమ నీజ్ఞానమహాసభాసదులు నానందన నర్ధించి "ఆ
దిని మీపూర్వ పితామహుల్ గురువులై దివ్యత్వమేపారగా
ఘనవిజ్ఞానకళా ప్రవృద్ధి ప్రజహృత్కాంతారముల్ నింపి రా
మని మీ రాకృతి బోధసేయదగు "ఉమ్రాలీష" భాషాగతిన్,

మ. అని నెయ్యంబున గోరగావిని మహర్షంబు సంధిల్ల నౌ
నని యీ జ్ఞానమహాసభాకథన మత్యంతంబు కష్టంబు మే
దిని సంసారనిమగ్న మానసులు నర్ధింపంగ సాధ్యంబు గా
దని యున్నంత నెఱుంగ సేతునని నే నారంభమున్ జేసితిన్,

ఉ. భారతదేశ శాసనసభా సభికత్వ పదంబు జేర నే
గోరగ జ్ఞాన సభ్యులు నకుంఠిత దీక్ష జగంబు మెచ్చగా
భూరితపస్సమాధి తమ బుద్ధిని నిల్పి జయంబు దెచ్చినా
రారయ జ్ఞానశక్తికి నజాండము కంపిలుచుండు జూచితే.

చ. కవిత నెఱుంగనట్టి పృథుకాలము వ్రాసితి పుస్తకంబు లా
కవిత నెఱింగి వ్రాయుటకు గంటమురాదు నుపన్యసించు నా
దినముల విద్యతో గలసి తృప్తి ఘటించెడు వాని నిప్పుడో
లవము నుపన్యసించుటకు లజ్జఘటించెడు నేమిచెప్పుదున్.

శా. ఢిల్లీ భారతశాసనైకసభ రూఢిన్ ప్రాతినిధ్యంబు సం
ధిల్లన్ జేరి మహత్తరోజ్జ్వల కళాధిక్యంబు రాజిల్ల వి
ద్వల్లోకంబున రాజకీయకలనా వ్యాపార పారంగతం
బెల్లన్ వేట్కను నిర్వహించుచును నేనీ గ్రంథమున్ వ్రాసితిన్

ఉ. ఏను హిమాలయంబుపయి కెక్కి తపస్సుల జూచి వారి వి
న్నాణములన్ గ్రహించి విజనంబగుచోట రచించినాడ నా
నా నవ కావ్యమార్గము లనంతముగా హృదయాంతరంగ వి
జ్ఞానము విశ్వరూపముగ గన్పడునట్లు దృశ్యంబు మార్చుచున్.

శా. నాలోనున్నవి నేనుజూచినవి విన్నాణంబులై లోకమం
దాలోకింపగ రాని యీ యమరవిద్యాతత్త్వ మర్మంబు లం
దేలోటున్ జనియింప దీశ్వర రహస్యైకైక మీమార్గ మే
మేలా దాచెద మంచు జెప్పితిమి మీరిద్ధాత్ములై తేరగన్.

కం. మా తాతయు మా తండ్రియు
ఖ్యాతిని ఆఖైలలీ మహాగురువర వి
ద్యాతత్త్వము నేర్చిరి త
ద్రీతుల వివరింతు యోగరీతులు తెలియన్.

ఉ. ఎల్లరు జెప్పుచుండిరల యీశ్వరుడీవని మీరుగూడ నా
కల్లలు బొల్లులల్లి కథగా నిటుకల్పనజేసి చెప్పగా
నొల్లునెయంచు మీరలన నోపుదురేమొ తదీయవాస్తవం
బల్ల రహస్యమున్ దెలిపి యద్భుతమార్గము విప్పి పెట్టితిన్.

మ. కనదుత్ పాదరసంబు తాత్త్వికుడు బంగారంబు గావించున
ట్లనుమానాస్పదమై వినాశకరమై యల్లాడు జీవుండు బ్ర
హ్మనుగామార్చెడు త్రోవజూపితి నిధి ధ్యాసంబు సంధించి మీ
కనులన్ విప్పుడు శూన్యమందు హరిసంకాశంబు సంధిల్లెడున్.

ఉ. మేమురచించు గీతములు మృత్యువాయువు పథంబులందులో
నేమియు నర్ధహాని కెడమియ్యక ఉన్నది యున్నట్లుగా
నేమహనీయుడున్ నడచి యీశ్వరరూప మెఱుంగ నేర్చునో
ఆ మహితాత్ముడొక్కడే యధార్థ మిఱింగి మృతిన్ జయించెడున్.

శా. నాతోనున్న మహాకవీశ్వరుల నానాకావ్యముల్ వ్రాసినెం
తొ తత్త్వాత్మక దృక్ప్రపంచకము నుద్యోగించి చిత్రించుచున్
చైతన్యంబు గలుగంగజేసితి మహాసత్యస్వరూపంబుతో
జేతోవీధిని నీశ్వరుంగనెడు వైచిత్ర్యంబు జూపించితిన్.

ఉ. ఎవ్వరి నొవ్వనాడమిటు లెవ్వరినోరును కట్టివేయమే
మెవ్వరిదారి దూరిమరలింపము మాకడవచ్చు వారితో
నివ్వటిలంగ నీ తెఱవునేర్పి తరించు మటంచు చెప్పి మా
దివ్వె వెలుంగ జేసెదము దివ్యులుగన్పడ బుద్ధిమ్రాన్పడన్.

అగ్గరాంబ

శా. ఆ ఢిల్లీనగరాంగ్ల శాసన సభాభ్యర్థిత్వ మర్థింపుడం
చాడన్ నేను కృతార్థుడై జనిన నాకై వచ్చి ప్రాణంబులున్
వీడెన్ నాసతి అగ్గరాంబిక చలత్ విద్యుల్లతన్ బోలె యా
నాడే నశ్రులు 'గోరి' పై విడుచుచు న్వర్తింతు నిర్జీవినై,

ఉ. ఏను రచించినట్టి కృతు లెన్నిటినో వినె తల్లి తండ్రి నా
నా నవనాటక ప్రకరణంబులు నాడగ జూచినారు ఢి
ల్లీ నగరాంగ్ల భారతమహీధవ శాసనసభ్య సత్పదం
బానగ గాంచి " అగ్గ" రమరాలయ మేగె వెలుంగుచుక్కయై.

శా. ఎన్నో బాధలు బొందుచుండు మని న న్నీ భూమివర్జించి యా
పున్నెపుంగని అగ్గరేగె దివికిన్ బూర్ణేందు బింబంబు వా
ర్ధీ న్నీద్రింపగ బోయినట్లిక మహాంధీభూత మాలిన్యం సం
చన్మాస్మన్వి నిషిద్ధజీవిత మభావం బెన్ని నాళ్ళుండినన్.

సీ. ఏమాట చెప్పిన నెదురాడగా లేదు
పరమ సాధ్వీత్వంబు వరలుకతన
ప్రాణాల నర్పించి పరిచర్యలను జేసి
పరమ హర్షంబు ముందరను నిలువ
కలిమిలేములను నొక్కటిగాగ గణియించె
నిత్యకళ్యాణంబు నెలకొనంగ

ఏవురు కొడుకుల నిద్దరు కూతుల
ననిశంబు దీవించు నాత్మ శాంతి.

తే. ప్రతిదినంబును చదువు ఖురాన్న మాజు
శౌచశీలాన నలువది వత్సరములు
ధరణి జీవించి స్వర్గాన కరిగె అగ్గ
రాంబ దివిజులు నీరాజనంబులిడగ.

చ. పరమపవిత్ర యీ వెలది పండితురాలు నితాంత సత్యసం
భరిత రసాత్మక ప్రకృతి వడ్డికి బారెడు ప్రేమమూర్తి సుం
దర సముపాసితం బయిన ధర్మపదంబును సంతరించి యీ
శ్వరునెద నగ్గరాంబ కడు ప్రార్థన సేయును నెల్లవేళలన్

శా. పల్లెన్ బుట్టిన ఢిల్లీలో బ్రిటిషుసామ్రాజ్యంబు పాలించు వా
రెల్లన్ వచ్చి సమాధిజేసిరి భవన్మృత్యున్ విచారించి యో
పుల్లాబ్జానన 'అగ్గరాంబిక' భవత్పుణ్యంబు దేశాల రా
జిల్లున్ విచ్చిన కుండబోలె వెప నే జీరాడుచున్నా నిటన్

చ. హృదయము ముక్కలౌనటుల వేడ్చుచు గన్నులనీరు కాల్వలై
చెదరంగ నిమ్ము లోకముల జేరుటకంటె సమాధితొంటి నీ
సదనము జేరుమార్గము విచారణజేయుట లెస్స యైపో కా
స్పద విభవానుషంగ భవబంధమువాసిన నిన్ను చూడగన్.

శ్రీ కవిగారు యిస్లాం మతస్థులు, వీరి మాతృభాష ఉర్దూ, ఆంధ్రభాష మాతృభాషగా కానివారు తెనుగున సరస కవిత్వము జెప్పినవారు ఈ కవిగారొక్కరే. వీరు రచించిన "మహాభారత కౌరవరంగ" మను నాటకమున.

"నాటకముల్ ప్రబంధము లనంతముగా రచియించి వాణి కా
వ్యాటవి భావవీధుల విహార మొనర్చి జయధ్వజంబు వా
గ్వీటీని నిల్పివట్టి జనవిశ్రుతు ఉమర్‌ఆలీషా కవీంద్రుడన్"
అని వ్రాసిరి.

శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి ఈ తత్వ కీర్తనలందు కూడ అనేక గంభీర భావముల నొసంగిరి.

"చంద్రుడెవరు చుక్కలెవరు
ఇంద్రుడెవరు ఈశుడెవరు
ఇంద్రియంబులు కట్టిచూచితే
యిన్నితానై యుండలేద"

....

" రాయినైతే రప్పనైతే
కాయనైతే కసరునైతే
ఏ యుపాయముచేతనో నే
నా యనంతుని బట్టియుందు"

మున్నగు పెక్కు ఋషివాక్యము లీ కీర్తనలందు చెప్పిరి. వీరు రచించిన "సూఫీవేదాంత" గ్రంధములో

మ. "కనదుత్ పాదరసంబు తాత్త్వికుడు బంగారంబు గావించు న
ట్లనుమానాస్పదమై వినాశకరమై యల్లాడు జీవుండు బ్ర
హ్మనుగామార్చెడు త్రోవజూపితి నిధిధ్యాసంబు సంధించి మీ
కనులన్ విప్పుడు శూన్యమందు హరిసంకాశంబు సంధిల్లెడున్.

' అని చెప్పిరి.

బ్రహ్మఋషి సత్తములైన శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి జీవితమును చరిచి అనేక తత్వగ్రంధములను వ్రాసి అజ్ఞానాంధకారమున నల్లాడు జీవునిబ్రహ్మనుగా మార్చెడు త్రోవజూపిరి.

వీరు రచించిన గ్రంధము లేబదివరకున్నవి. శ్రీ కవిగారు తమ దర్శన మిచ్చుటకై నరసాపురము (పశ్చిమ గోదావరి జిల్లా) వెళ్ళి అచ్చట ది. 23 జనవరి 1945 నాటి సాయంత్రము 5 గంటలకు దివి నలంకరించిరి. వీరి భౌతికదేహమును పిఠాపురము దెచ్చి 24 వ తేది సాయంత్రము రైలుస్టేషను వద్దనున్న వారి యారామములో సమాధి చేసిరి.

పడాల శివశంకర మూలారెడ్డి, శ్రీమతి వెంకట నరసమ్మ

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం కా॥లు శ్రీ పడాల శివశంకర మూలారెడ్డిగారు, శ్రీ పడాల వెంకటరెడ్డి, శ్రీమతి అమ్మన్న దంపతులకు జన్మించిరి. వీరి సతీమణి శ్రీమతి వెంకట నరసమ్మగారు. వీరికి ఇద్దరు అబ్బాయిలు. పడాల వెంకటరెడ్డి, రామకృష్ణరెడ్డి, ఒక అమ్మాయి కర్రి శారదాదేవి. శివశంకరమూలారెడ్డి, శ్రీమతి వెంకటనరసమ్మ గార్లు 1978 సం॥రలో సప్తమ పీఠాధిపతి బ్రహ్మర్షి హుస్సేన్‌షా సద్గురువర్యుల వద్ద మంత్రోపదేశము తీసుకున్నారు. వీరి పిల్లలు ముగ్గురు ప్రస్తుత పీఠాధిపతి డా॥ ఉమర్ ఆలీషా సద్గురువర్యులవద్ద మంత్రోపదేశము తీసుకున్నారు.

స్వర్గీయ శ్రీ పడాల శివశంకర మూలారెడ్డిగారి జ్ఞాపకార్థము వీరి శ్రీమతి నరసమ్మగారు, కుటుంబ సభ్యులు ఈ పవిత్ర గ్రంథము ముద్రించుటకు తోడ్పడి ధన్యులైనారు.

విషయసూచిక

పుట

1. పూజ ---------- 1
2. ధ్యానము ---------- 2
3. నివేదనము ---------- 2
4. తత్వము ---------- 4
5. కలిసంహారము ---------- 6
6. గాలిపాట ---------- 8
7. నిర్వాణ గీతము ---------- 9
8. హారతి ---------- 12
9. నిరాశ ---------- 12
10. జీవుని కథనమ ---------- 15
11. ఓ కారుణ్యాగణ్య శరణ్య ---------- 17
12. అన్వేషణము ---------- 17
13. మానవ జీవితమోతీరున మారునో ---------- 19
14. ఇవిగో పూవులు స్వామి ---------- 20
15. వచ్చి వచ్చేదాక ---------- 20
16. వినుగనుగొన నా మనము తపించె ---------- 23
17. తొట్టిపాట ---------- 24
18. కోరి వినుమ తత్వచరితము ---------- 27

అనుబంధము

19. ప్రబోధము ---------- 31
20. ధ్యానము ---------- 32
21. ధర్మము ---------- 33
22. దీక్ష ---------- 33
23. మేరాజ్ ---------- 34
24. ప్రార్థన ---------- 35
25. ఈశ్వరుఁడు ---------- 38

కృతి

శా. శ్రీ యాభై లలీషా గురూత్త ముని సం
సేవించు విద్యాప్రభా
ప్రాయంబైన వెలుంగు నింగిత ముషః
ప్రాభాత సంధ్యాతమో
ధ్యాయం బైన నిశాకవాటముల హృ
ద్ధ్వాంతంబుతోఁబాటు పోఁ
ద్రోయం జాలు తదీయ తేజ మొదనెం
తో వేట్క నర్ధించెదన్.

తత్వసందేశము

కం. అనఘుం డీశ్వరుఁ డొక్కం
డని ఏమహమద్రసూ లజాండములోఁజాఁ
టెను ఆతేజమును సదా
మనమునఁ దర్కించి నేనమస్సులొనర్తున్.

పూజ

1

విరులు కరముల తెండొ
తరియింప మీహృదయ
సరసి లోపల త్రెంపి ॥విరు॥

2

తెఱచియున్నదిస్వామి । పరమార్థమందిరము
పరఁగు జ్ఞానపుదీప । పంక్తితమమునుబాప
కరుణారసము వెల్లి
విరియుచున్నదిభక్తి ॥విరు॥

3

తడవేల చీఁకటుల । పడరాని కష్టాలఁ
బడిమాయ యనుకడలి । కడతేరకున్నారు
చెడనట్టి యీకాంతి
పడవెక్కి దాఁటెదరు ॥ విరు॥

4

చననేల పాపాల । మనరానిదుఃఖాల
గని కృంగి కృంగి మే । దిని బుట్టివ్యసనాల
మునిఁగిపోవుట చాల
తునిఁగిపోవుట మేల ॥వి ॥

5

స్వాగతంబిడి చేయి । చాచి రమ్మనుచుండె
ఆ గురుస్థానమున । కాకాంతి ధామమున
కేగి ఉంరలిషాతో
భాగధేయము గాంచి ॥విరు॥

ధ్యానము

1

అజ్ఞానపు తెరలో నా । హరి తోఁచెను చూడు
జిజ్ఞాసను మబ్బున నెల । చెన్నారెను నేఁడు

2

కన్నీళ్ళను దావాగ్ని । కణజాలము గలదు
ఖిన్నుల యెద రుధిరములో । కెరటంబులు గలవు

3

రాధానయ నాబ్జములకు । రవియుదయించినను
మాధవుఁడే యగపడు విను । వీధులు వెలుఁగఁగను.

4

శుక్తికలో ముత్యమ్ములు । శోభిల్లుచు నుండె
భక్తిని ఉమరలిషాకవి । భగవంతుడె నిండె

నివేదనము

1

ఏమియ్యఁగలను । స్వామికినేను
ఏమియ్యఁగలను
ఈమహిలో సార్వ । భౌముఁడవు నీవు
ఈ మహిలో వట్టి । నిఱుపేదను నేను ॥ఏ॥

2.

నినుఁజేర మఱచి । మాయనువదలు
కొనలేక వెఱచి
కనక కిరీటాలు । ఎనలేని భాగ్యాలు
గొన దోసిళ్ళను । బోయు నినువదలుకొన్న ॥నేనే॥

3

పృథువసువులను । మాపై గురిసి
పృథివినిండగఁను
శిథిలము కానట్టి । నిధులెన్నో కూర్చితివి
విధి! నీకర్పణసేయ । కథముఁడ పతితుడఁనై ॥ఏ॥

4

జగములునీవె । సచరాచర
మగువసుధవీవె
అగపడని స్వర్గాలు । దిగువున్నలోకాలు
గగనవీథులు నీవె । తెగినీది కానీది ॥ఏ॥

5

ప్రణవరూపుఁడవు । సర్వమునీలో
నణఁచి యగపడవు
గుణములలోఁ బుట్టి । అణువులలో మెట్టి
తృణములు చేఁ బట్టి । మణులని చెప్పి ॥నేనే॥

6

ప్రతిదిన దినము ఈ దుఃఖము
బాధించు నెదను
బ్రతికినన్నాళ్ళు నీ । పదముల శిర ముంచి
గతినీవెయని రెండు । కన్నీళ్ళ కన్న ॥నేనే॥

7

నిను జూచు కొఱకు । కన్నులుకాయ
లను గాచెనాకు
మనసుపై తెరఁదీసి । గనిన ఉమరలిషాను
గనిన తీరున గనుమా । ఖై లలిగురుదేవ ॥ఏ॥

తత్వము

1

వెఱ్ఱులై తిరిగెదరు జనులార
నిజమింత దెలియక వెఱ్ఱులై తిరిగెదరు జనులార.
మట్టికిరువది యైదు కొమ్ములు
తొట్టలారయతొమ్మిదున్నవి
సఱ్ఱు సఱ్ఱున తిరుగుపక్షి
తుఱ్ఱుమని పోతేను మిథ్య ॥వె॥

2

ఏడు కొండలుచుట్టి కుండలి
పాడుచున్నది ప్రణవనాదము
తోడనే మనసనెడు చేటిక
యాడుచున్నది జీవనాటిక ॥వె॥

3

పంచకోశము లనుసరించి
పంచవాయువులను నటించి
పంచ విషములను కలంచి
సంచరించెడు హంస నెఱుఁగక ॥వె॥

4

సుందరంబగు సరసులోపల
మందిరం బొక టున్నదదిగో
అందులోపల వెలుఁగు దీపము
ముందు నిలిచిన చక్రి నరయక ॥వె॥

5

ఒక్క చూపునఁ గాంచితేను
ఒక్క మాటను తెలిసి తేను
ఒక్క జ్యోతిని నిలిచితేను
నిక్కముగ తను దెలియఁగలరు ॥వె॥

6

చంద్రుఁ డెవరు చుక్క లెవరు
ఇంద్రుఁ డెవరు ఈశుఁ డెవరు
ఇంద్రియంబులు కట్టిచూచితె
యిన్ని తానైయుండలేద ॥మె॥

7

బంతిచెట్టు పసరుదైనా
బంతిపువ్వు పసిమిదౌను
అంతే చూడు నరుఁడుగూడ
వింతగా హరి యగును నిజము ॥మె॥

8

నీటిచుక్క ముత్యమైతే
తేటియెంగిలి తేనెయైతే
సూటితప్పని గురుని మంత్రము
కోటిసూర్యుల కాంతికాద ॥మె॥

9

బురదలోపల పద్మమైతె
ఉఱుములోపల మెఱుపు మెఱసితె
తరువులోపల నగ్నియుంటె
నరునిలో దేవుండు గలఁడు ॥మె॥

10

ఆకసంబున నల్లమబ్బు
తోఁకచుక్కను తళుకుబెళుకు
వేకువందున నెఱ్ఱకాంతి
మీకు సంసారంబు లంతె ॥మె॥

11

ఒకటిలో నొక సంఖ్యయున్నది
ఒకటిలేక సంఖ్యలేదు
ఒకటి పుట్టిన చోటు మనకు
ఊహకూడ చొఱకయున్నది ॥మె॥

12

ఆదియందున నీవె యుంటి వ
నాదియందున నీవే గల వా
వేదభావము తెలిసితే నిఃఖేదబ్రహ్మము తానెగాదా ॥వె॥

13

దీనిభావము తెలియవలసిన
వాని ఉం రాలీష కవివలె
జ్ఞాని శ్రీ యా ఖైలలీగురు
స్వామి పాదము బట్టవలయును ॥వె॥

కలిసంహారము

1

రారేమి అక్కలారా
ద్వారాలు తీయరేలా
క్రూరుఁ డాకలి కల్కికి
ప్రారంభమయ్యె
పోరు మిన్నులు ముట్టఁగ ॥రా॥

2

నిప్పులు గురిసె నభము
అప్పుల ముంచె జగము
విప్పి విప్పని బంధాలు
తప్పించుకొనుచు
చప్పుచప్పున పరువెత్తి ॥రా॥

3

ఏళ్ళన్ని పొంగె నందు
ఊళ్ళన్ని మునిఁగే ముందు
బళ్ళ బాటలు కల్గు నా
కళ్లారఁ జూచి
వెళ్ళు వెళ్ళుఁడు బైటకు ॥రా॥

4

చీఁకట్లు దిశలు నిండె
వాకళ్ళ మంచు పండె
వేకువ యింక రాదేమో
ఆకాశవీధి
తోకచుక్కలు కన్నారా ॥రా॥

5

నాగళ్ళు దున్నినట్టి
రాగాల మబ్బు మళ్ళ
దాఁగె చంద్రుఁడు మింటను
ఆ గంటలోనె
తూఁగి చుక్కలు రాలెను ॥రా॥

6

చదలేటి యంచపిండు
కదలేటి మబ్బుకొండ
కెదురు తెక్కలు ఱువ్వఁగ
రుధిరంబు గురిసె
నదులై లోకము ముంచఁగ ॥రా॥

7

పాతేటి యేటియడుగు
జాతేటి నెలల వెలుఁగు
తేఱి చూచిన చెంగలువ
గోరింటలోను
దూఱి నింపెను నెత్తురులు ॥రా॥

8

పాతాళవీధి కేగి
లోతైన జలధి దాఁగి
భీతిఁ గలిగెడు లోకాల
కేతెంచి వచ్చె
దూత కర్థ్యము లియ్యరె ॥రా॥

9

కల ల్క యుద్ధమంటె
తలకట్టు విప్పి కట్టె
కలికి కెంతటి రోషమొ
అల యాదిశక్తి
చలము గెలిచెను చూడంగా ॥రా॥

10

ఈ కల్ప మంత మొందు
ఆ కల్కి రాజ్యమందు
శ్రీ కయి ఉం రలిషాకఁ
కా ఖైలలీషుం
డీ కథార్థము చెప్పును ॥రా॥

గాలిపాట

1

నే నెవ్వరో మేన । తా నెవ్వరో తెలియబోదు
కానరాని కోన । లోనుండి యేనాడొ
ఈనాడు ఈ నర । జన్మమెత్తి
నే నని గర్వించి । యేదొ ఒక్కనాడు
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

2

రేయెల్ల వెన్నెల । గాయుచు చరమాద్రి
బోయి మోమును వాంచి । చందమామ
యే యూసు ఆమెతో ।యెఱిగించెనో మనకు
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

3

పూలవాసన లెన్నొ । మోసి తెచ్చిన
చల్లంగాలి యొడలు । పులకరింపజేసి
ఆలోచింపుచునుండు । నంతలో ఏదిశకొ
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

4

కలిమి తానైవచ్చి । కలధౌతసౌధాల
నిలిపి యుయ్యలలందు । నూపియూపి
కలగన్న చందాన । నిలయమౌ కణములో
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

5

వనములో పక్షులు । వసియించి యానంద
మున గూడి తమతమ । పాటపాడి
దినము గ్రుంకంజూచి । దిగులొంది గూండ్లకు
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

6

నీలమేఘములందు । నిలిచి వెన్నెలకన్న
మేలైన కాంతుల । మెఱసి మెఱసి
కాలగర్భములోన । పాలై యగపడకుండగ
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

7

అకలంకు డైనట్టి । ఆ ఖయిలలీ గురుని
ప్రకటించు మంత్రాల । పాడి పాడి
ఇక రాని యాకర్మ । ఉం రాలిషాకవికి
చెప్పిపోవుట కిది । చెప్పి వచ్చినదా ॥నే॥

నిర్వాణ గీతము

1

తుది మీరేగతికిc బోదురో – మీరేగతికిcబోదురో
తుది మీరేగతికిc బోయి
మొదలు తెలియని యా యగోచర
పదము నిర్వాణంబు ననియెడు
సదనమునకో – శూన్యమునకో
కదలిపోయి చూడనుంటిరి

ఈ దృశ్యమంతా
వదలివేసి వెడలనుంటిరి
అది మహా యపవర్గమార్గము
ఇది ఇహాన కుపాధివర్గము
ఇది తొలంగిన లేదు మోక్షము
ఉదకమై వర్షించి నేలకు ॥తుది॥

2

ఇహము చూచి వదల నేరరు
ఇందున్న మోహ
మహిమలేమొ పలుకఁబోవరు
మహి మహాభాగ్యములు దుఃఖ
సహితమైనను పూలవన మని
బహువిధంబుల పొగడి కర్మ
కుహరములలోఁజిక్కి పాప
రహితమైన పదవి బాసితిరి
అందున్నజ్ఞాన
మహితమైన తెరవువీడితిరి
దహన సంస్కారమున తనువు
తుహిన కణముగ నెగిరిపోవ
విహితులాపై రారు మీరే
గుహనొ గర్భములోనొ గూలి ॥తుది॥

3

ఆకలంబులు కదలుచుండును
అందున్న జీవి
వ్యాకులంబును బొందుచుండును
మీకు వానికి భేదమేమి
శోకమోహ భయావకాశము
లేకమే గద దృశ్యమగు నీ
లోకమందలి యెల్లవారికి
ఆకులోపల అకు నేననుచు
అందున్న తన వి
వేకమందున నాత్మగలదనుచు

ఆ కళాలోకంబులో నా
లోకనంబును జేయఁగలిగెడు
మైకమున నీశ్వరునిఁ గాంతురు
లేకపోతే జారిపోయి ॥తుది॥

4

తనువు నేనని విడువనోపరు
నూరేండ్లు బ్రతికిన
తనకు తానై తెలియఁజాలరు
తనువు మీరే మనము మీరే
కనులలోపల పాప మీరే
తను నెఱింగిన తత్వమందు
తనకు తానే తెలియుచుండ
తనువు వేరే బాయనేరదు
దృశ్యమున మీరు
గనిన మరణము మరణమే గాదు
వినుఁడు రుజ్జువు సర్వమనుకొని
కనులు తెఱచియు భ్రాంతివిడచిన
గనిన నొక్కటె రెండుగాదు
తనువు జీవుల కట్లెఱుంగుఁడు ॥తుది॥

5

ఒక్కమాటలో నెఱుంగుడీ
మీరున్న చోటు
ఒక్క సూటిలోన పొందుడీ
ఇక్కడక్కడ వెలుఁగు జీవుం
డొక్కఁడే దేహమిది ప్రకృతి
నిక్కముగ ఛాయాస్వరూపము
లెక్కలేనిది దీనితీరును
దక్కి శ్రీయా ఖై లలీగురుని
పద కమలములకు
మ్రొక్కి ఉంరాలీషకవి గతిని

చుక్కలిలపై రాలినను భువి
ప్రక్కలైనను మానకేనను
ముక్క తెలిసేదాక సాధన
చక్కగా గావింప కుండిన ॥తుది॥

హారతి

హారతి జయజయ హారతి
శ్రీ గురుదేవ ॥హా॥
గైకొనుము స్వామి

1

నీరాజనములు నీ । పేరు పేరునఁ గూర్చి
ఆరాధించుచు భక్తి । నర్పించు కర్పూర ॥హా॥

2

పరమభక్తులు జ్ఞాన । భరిత సాధ్వీమణులు
కరములు మోడ్చి యా । విరి పళ్ళెరముననిచ్చు ॥హా॥

3

పరతత్వ తేజమున । వరములు మాకిచ్చి
యరయు ముమరలిషాను । నరసి నట్టుల నిదిగో ॥హా॥

నిరాశ

1

ఎవ్వరికి లోకమందు
ఎప్పటికి ఏమిగలదొ
ఎవ్వరికి ఏమియెఱుక
ఎఱుకఁజెప్పేవారు కలర –
ఎఱుకఁ జెప్పేవారు కలర –
మఱుఁగు విప్పేవారు కలర ॥ఎవ్వ॥

2

ఏమికర్మఁ జేసినాను
ఈశ్వరునిలో నున్న నేను
భూమిపైని బుట్టి మాయను
బురదలోను పొర్లిపోవ ॥ఎవ్వ॥

3

ఎందుకు ఈ నరుని జన్మ
ఎందుకు ఈ నరుని కర్మ
ముందుకు ఏనఱక మున్నదొ
ముప్పుగడిచే దాఁక నిజమా ॥ఎవ్వ॥

4

పూవు నైతె కొన్నినాళ్ళు
తావి విఱిసి సొగసు మీఱి
భావ వీధుల సంచరించి
బట్టియుందును హరినిగాని ॥ఎవ్వ॥

5

రాయినైతే రప్పనైతే
కాయనైతే కసరునైతే
ఏయుపాయము చేతనో నే
నా యసంతుని బట్టియుందును ॥ఎవ్వ॥

6

మంచి చేసిన పనికిరాదు
మంచి వదలిన పనికిరాదు
మంచి చెడ్డల ఫలములను నా
సించ కుండ నుండలేము ॥ఎవ్వ॥

7

పాలుపోసి పెంచుచున్న
వారె కీడు కోరవచ్చు
కాలమందె మేలు లేదు
మేలుజేసి యేడ్వనేల ॥ఎవ్వ॥

8

ఒరుల కపకృతి సేయకున్న
ఒరుల ధనములు ముట్టకున్న
నరులు బాధలు పెట్టుదురు పు
ష్కరుడు నలుని పెట్టినట్లు ॥ఎవ్వ॥

9

ఆకసమునఁ దిరుగుచున్న
లోకమునకు మిత్రులైన
రాక చంద్రుని సూర్యుని యా
రాహుకేతులు క్రింగుచుంద్రు ॥ఎవ్వ॥

10

రాముఁడు రారాజె గాని
రావణునితో రట్టుదగిలి
భామను విడనాడి యెన్నో
బాములను బడి బ్రతుకవలసె ॥ఎవ్వ॥

11

నేను దేవుం డన్ననాఁడె
మానుసూరు★ని ఉరినిదీసిరి
మేనులో దేవుండు లేఁడ
నేను దేవున కన్య మగుదునా ॥ఎవ్వ॥

12

సార్థవాహులు అపుడె గమ్య
స్థానమునకుఁ జేరుచుండిరి
అర్థవాదమందు నేను ని
రర్థకముగ వెనుకఁ బడితిని ॥ఎవ్వ॥

13

కలిమి యెల్ల కాల ముండి
కాలమునకు పనికిరాదు
తెలిసి ఉమరాలిషా కవి తా
తెలియఁ జెప్పెను తెలిసికొనుఁడీ ॥ఎవ్వ॥

★ అహం బ్రహ్మాస్మి అన్న ముస్లింయోగి మన్సూరు.

జీవుని కథనము

జీవుని కథనము జెప్పెద వినుము
ఈ విశ్వమును జేరఁగ వచ్చిన త్రోవ ॥జీ॥

1

ఆ విరాట్టునుండి ఆనాఁడు తెగిపోయి
ఆవిర్భవించి మర్త్యాకార మందఁగ
చావు పుట్టుక లనెడు ద్వైధీ
భావములఁ బడి జడుని కైవడి
కేవలాజ్ఞానాంధకారమె
తావలంబగు తనువు తానను ॥జీ॥

2

ఈ పంచభూతాల నిమిడిన విషయాల
ప్రాపుజేరి ప్రపంచములోపల
ఆపద లనుభవింపగను జన్మించి స
ద్రూపము చెడి యేదో రూపము గైకొని
కాపురము జేయుచును సతి సుత
రూప తాపత్రయములను బడి
ఆ పరబ్రహ్మస్వరూప మ
హా పదార్థము మఱచి తిరిగెడు ॥జీ॥

3

శారీరకపు సౌరు కారణమగు తీరు
కోరి పుత్ర దారేషణావస్థల
మీరఁగలేక సంసార ఘోర పారా
వార మీదు దారి నేరక గాఢాంధ
కార మగు ప్రారబ్ధ కర్మా
గారమున జడుఁ డగుచు తొంబది
యాఱు చక్రము లున్న తనువును
ఈ రథంబును నడుపుచున్న ॥జీ॥

4

రేలని పగలని కాలచక్రములోని
కీలు తెలియలే కార్తిపాలై కల
కాలము విషయసౌఖ్యాళి నోలలాడి

యీ లోకమే నిజమం
చాలోచించి యెపుడో
కూలి యీ తిరుగలిని బోలెడు
కాలనిహతిని బూడిదై తుద
ధూళిధూసరములను గలిసి వి
శాల విశ్వము విడిచిపోయే ॥జీ॥

5

మాయయు ఆ ప్రతి ఛాయయు గల యుపా
దేయమైన యీ కాయమే యీ యవి
ద్యాయుత మగు దేహావరణ విక్షేప
మై యొప్పు, కూటస్థమై యున్న పరమాత్మ
కి యుపాధియు నింద్రియంబులు
నీ రజస్సత్వాది గుణములు
నే యవస్థల నంట కిది జల
తో యజంబుల తీరు దనరు ॥జీ॥

6

అణురూపముగ మారి జనని గర్భముఁజేరి
జననమొంది బాలేందు బింబాకృతి
దినదినము పెఱిగి జీవన నాట్యరంగమున
జని కాలుమోపి నర్తనము జేయుచు స్వీయ
ఘన మహాచరితంబు బాడుచు
వినుచు నీ మూన్నాళ్ళ బ్రతుకును
గనుచు నిది తనదనుచు తుది కల
గను విధంబున విడిచి నడిచే ॥జీ॥

7

ఈ కర్మవాంఛల చీకాకుపడి చాల
శోక మోహ భయైకమౌ నూహల
ఆకాశమునకు భూలోకంబునకు త్రాళ్ళ
తో కట్టి యూగఁగ ప్రాకి ప్రాకి యెపుడొ
ఈ కళేబర మిచట విడచియు
నాకమున కేకాకియై యా
భీకరములగు పథములను బడి
పోక మునుపే తెలిసికొనుటకు ॥జీ॥

8

ఆఱుఱు తత్వాల మీఱీన యోంకారా
కారమైన యాకారమె జీవుఁడు
ఆరూఢి సుషుమ్నాదారి నివ్వరిముల్లు
తీరు మెఱయుచు హరిని జేరు ధారణయఁగ
ఆ రహస్యము తెలిసి ఉమ
రాలిషాకవి వలెను సాధకు
డాఱితేఱి వివాద మణచియు
నూరకొను నానందమందుచు ॥జీ॥

✪✪✪

(శ్రీవాణీశా అనువరుస)

1

ఓ కారుణ్యా గణ్యా శరణ్య
ప్రపుణ్య ॥శ్రీకా॥
లోకవందిత హిత । శ్రీకరా శ్రిత
లోకపాలకా మమ్ము కా । పాడుమికా భయవారకా ॥ఓ॥

2

పాప తాపములుడుప । నాపదలను బాప
రూపమెత్తువాఁడా । దీపించుప్రోడా
కాపాడు ఱేఁడా । మాపాలి లేఁడా ॥ఓ॥

3

సూర్యచంద్రుల వోలె । శోభిల్లెడి వెల్ల
కార్యములను నీ వై । శ్వర్యముల తావై
ఆర్య గుణఖనివై । ఉమ్రాలిష నుతివై ॥ఓ॥

అన్వేషణము

1

ఎఱుఁగుట యెట్టులో
హరి నెఱుఁగుట యెట్టులొ
తెఱ విదె యని మఱుగూ
నెరసై మెరపై యిరులను బాపెడు హరి ॥నెఱు॥

2

దురిత భవంబులు । దురిమియు మాయా
వరణ మెల్ల ద్రోసి నీ । చరణాబ్జ
యుగంబుల మోసి
శిరమిడి జోహారులు జేసి
అఱువది నాలుగు విద్యలు వచ్చిన
తఱగని రాజ్యములెన్నో యున్న
తెఱకావల నున్న నిన్ను జూడన్
తరమాయని యఱచెద రహహా ॥యెఱు॥

3

చిల్లర పూజలుసేయ నా
యుల్ల మొల్లదేమో దేవా రా
జిల్లె దీవు జగమీవయై
యెల్లలోకములను బ్రోవ
తల్లివగుచు తండ్రివగుచు
కంటికి రెప్పవోలె
నెల్లవేళ నెంతో చల్లఁగఁ బ్రోచెదు
వెల్లడవక పసిపిల్లలట్లు మమ్ము
జూచె దైనను ॥ఎఱు॥

4

జపములు తపములు నుపవాసంబులు
అపరిమితముగా సలిపి ని
ష్కపటంబుగ నిన్నెద నిలిపి
యెపుడును లక్ష్యార్థము కలిపి
విపుల భవన్మహనీయ మహాకృతి
విపరీతోన్నతి విశ్వమయంబును
నెపమున సచరాచరములలో నీ
కృపకయి దోసిలిఁజాచ్చు వేడిన ॥ఎఱు॥

5

ఆపద లందున నడ్డై చేయిడి
లేపువాడ వీవె నీ
రూ పిది యని తెలిసెడు తావే
తోపదు నీ వీధర లేవే

తాపత్రయములఁ బడి చెడిపోయే
కాపురుషావళి నైనను గాచెడి
భూపతి వని పొగడెద రందరు
పాపహరణ పరమపురుషుని ॥ఎఱు॥

6

ఎందఱినో కనుఁగొంటి, నా
ముందుదారిఁ గోరిస్వామి, వా
రంద రేవొ వచియించి నా
రందు గానఁబడ వ దేమి
ఇందుగలవ అందులేవ
అందరు నీవకావ
సందియంబు లాత్మన్
జెందక నిన్నెదలోనఁజూచి యా
నంద మొందు ఉమ్మరాలిషా వలె ॥ఎఱు॥

✪✪✪

(ఏక తాళము)

మానవ జీవిత మేతీరు మారునొ
గానరా దెవ్వారికి
ఆనంద మొప్పారు । అతిశయముల మీరు
ఏనాఁడొ పడిపోవును ॥మాన॥

ఆనాఁడు దుఃఖాల మేఘాలు వర్షించు
మానస మను బీళ్ళు । మునిగి నీరయిపోవు ॥మాన॥

ఏలాటి చిత్రాలు । కాలగర్భమునందు
గ్రాలి రానున్నవో – ॥మాన॥

ఫాల ఫలకమందు వ్రాలు జరిగి తీరు
ఏలాటి యత్నాలు నేలపాలైపోవు ॥మాన॥

తెలివితేటలు నున్న కలిమి పోయెడునాఁడు
గవ్వకు మారవుగా । గుడ్డి గవ్వకు మారవుగా ॥మాన॥

ఖలుఁడని యనిపించు । తులువా యని తిట్టించు
ఇలువెళ్ళఁగొట్టించు । కలవంటి దీబ్రతుకు ॥మాన॥

✪✪✪

ఇవిగో పూవులు స్వామి
ఇవిగొ లాజలు స్వామి
ఇవిగొ పూజలు స్వామి
ఇవి గైకొన వదేమి
నా సామి
నా లేమి
నే నేమి
ఈయగలను - నీకు
ఇయ్యగా గలను -
మనసునే
వేలు భక్తులు నీకు
వేలు పూజలు నీకు
వేలు మ్రొక్కులు నీకు
నీలోన నే నొక్క
నెరసూ నైన కాను.

వచ్చి వచ్చేదాక

1

వచ్చి వచ్చేదాక
వచ్చి వాయెత్తి పిలిచావు
వచ్చి వాకొట్టి వేపావు
వచ్చి వాపోయి తిరిగావు
వస్తే చూపిందేమి
వస్తే చెప్పిందేమి
ఒక మాటలో దైన
ఊసు చెప్పావ
ఒక పాటలో దైన
మరుగు విప్పావ.

2

వెలగొన్న ముత్యాలు
తలఁబాలు బోసితే

అలకా పురాలన్ని
అగపర్తు నన్నావు
ఊర్ధ్వలోకాలన్ని
వెలిబుత్తు నన్నావు

3

పాతేటి యేటిలో
పారాణి అగపడితె
ఆ రూప మెవరిదో
అడిగిచెప్పావ, మాకా
అడుగు చూపావ, మా
నుడులు విన్నావ.

4

గంగ పొంగే చోట
సింగారు ఆ తల్లి
నింగి మెఱసేలాగ
తొంగి చూచాను-
ఆ చూచే-
త్రోవ చెప్పావ-ఆ
క్రేవ తొక్కావ-

5

ఆ వెండి కొండపై
ఆస్వర్గ మగపడితె
దేవతా కలశాల
తే నిచ్చినావ! ఆ
దేవతా గానాల
విన నిచ్చినావ, స్వామి.

6

ఆ పర్వతాలలో
ఆ పరంజ్యోతిలో
రూపించు నీ రూపు
చూపవచ్చావ-అది
చూడనిచ్చావ- ఆ సొంత
మది-చూడ నిచ్చావ.

7

మంచు కొండలెక్కి
నించోని చూచి పా
వంచాల పాతాళమునకు
పోయావు, మా
కథలె విడిచావు.

8

బాట పొడవున వన
స్పతులు వస్తూవుంటె
మాటలాడే విధము
మాకు చెప్పావ-మా
మనసు నిలిపావ.

9

చీఁకట్ల చదలేటి
వాకళ్ళ తలుపులు
నాకవాసులు తీసి
మాకేసి చూచితె
ఆ కబురు
మాకు చెప్పావ-మా
మాట తలచావ.

10

ఆ చిత్ర చిత్రాలు
ఆ చెంచు గూడాలు
ఆ చాటు మాటులు
చూడ నిచ్చావ-
అడగ నిచ్చావ.

11

రాగాల వీధుల్లో
నాగ స్వరాలలో
మూగవాళ్ళుగ పెట్టి
లాగి వేశావె-మ
మ్మాగ నిచ్చావె-నిమిష
మాగ నిచ్చావె-

12

కురుపాండు యుద్ధాల
క్రొన్నెత్తు టేరుల
చెరువులను నిర్మించి
చెప్పి గీతాలు-ఆడి
తప్పి పోయావు-

13

కడలి కెరటాలెక్కి
సుడులలో పడవైచి
నడిదారి హరిచేరి
అర్థించినాము నిన్ను
దర్శించినాము.

14

ఈ జీవ యాత్రలో
నే జేయు యాత్రల
పూజించు నా స్వామి
ఆలీషా పొమ్మన్నరాడా.

✪✪✪

1

నిను గనుగొన నా మనము తపించె నన్
గనుగొన వపార కరుణా భరణా ॥నిను॥

2

అన్నియు నీ వని అర్పణ జేసితి
నన్నెడ బాయుట న్యాయమాస్వామి ॥నిను॥

3

నీలో నే నొక నెరసును కానో
ఆలోచింపుము ఐక్యముజెంద ॥నిను॥

4

నావా రెవ్వరు నీవేకావా
ఆవలగల నాతావే నీవని ॥నిను॥

5

హృదయము వీణాకృతి కృతిపాడుచు
అదె నినుబిలుచు నుంరాలీషావలె ॥నిను॥

తొట్టిపాట

1

శ్రీమీర వరము లిడఁగా
భక్తులదె ముకుళితాంజలి వేఁడఁగా
ఆ మహాస్వామి కలికి
అవతార మెత్త సంకల్పించెను ॥శ్రీ॥

2

స్వర్గీయ దివిజ కోటి
నిర్గమన విధము లేర్పడఁజెప్పెను
భర్గు లింద్రాదు లపుడు
అర్గి రాయాదేశ రారాజులై ॥శ్రీ॥

3

కల్ప వృక్షపు పంక్తులు
కనక కామధేనుల మందలు
వేల్పు వైజ్ఞానికులుగా
రే కెత్త దిశలకై । సాయించిరీ ॥శ్రీ॥

4

అమృత వాహిని కురియగా
సమకట్టె మెరపుమెరిసిన తీరుగా
తమసులిల దిగజాఱెను
విమల వాఃపూరముల్ విరజిమ్మెను ॥శ్రీ॥

5

గగనాల ఘంట మ్రోగె
నిగమాల నుడులుమార్మ్రోయించెను
యుగయుగాంతర సంధిగాఁ
దగుననుచు ప్రజలు నాకర్ణించిరీ ॥శ్రీ॥

6

ఆకాస యానములను
అంబుధుల గర్భాల భేదించియు
రాకాశశాంకుఁడనఁగా
లోకాన బాలుఁడై జన్మించెను ॥శ్రీ॥

7

ఈ బిడ్డ జై వాత్సకుండు
ఈబుడుత లోకాలనేలు ప్రభుఁడు
ఈ బాల శశిబింబమా
మాపాలి పెన్నిధిగ ఱూపించెను ॥శ్రీ॥

8

సూర్యచంద్రులు నేత్రముల్
ఫాలంబు రుఙ్మండలము చూడఁగా
శౌర్యంబు సొంపారఁగా
నవ్వువెన్నెల నవ్వి నవ్వించెను ॥శ్రీ॥

9

దృష్టిఏటికి తగులును
దుష్టసంహార కఁడుగఁ బుట్టెను
అష్టకాంతల తోడను
ఆవిర్భవించె హరి అవతారమై ॥శ్రీ॥

10

నాదాతి బిందాతియూ
కళాతి ప్రణవాతి ఆదిత్యలూ
ఆదిఫాలదరీలు
నాగకన్యలు లాలియని పాడిరి ॥శ్రీ॥

11

ఈ రేడులోకములకు
ఈరేడు సిరులు గురియును నేఱుగా
ఆరామలెల్ల తోడై
గాగాబుపట్టి తొట్టిని బెట్టిరి ॥శ్రీ॥

12

జయహారతుల నిచ్చియు
పళ్యాల ఫలహారములు పంచుచూ
నయగాన కళలు చెలఁగా
హైహయలుపాడి అభివర్ణించిరీ ॥శ్రీ॥

13

పాడిపంటలు పండునింకా
పాలేరు లేరులై ఏపారగా
తోడునీడై ధర్మము
కాపాడు మాకాతఁ డాదర్శమై ॥శ్రీ॥

14

నిత్యకళ్యాణ మింటా
పచ్చతోరణలు వ్రేలుచు నుండఁగా
సత్యదేవత లెల్లరు
ఆశీర్వదింపగా నిదెవచ్చిరి ॥శ్రీ॥

15

ముత్యాల ముగ్గుబెట్టి
రంగవల్లికల వేడుక నింపుచు
నృత్యాలు సేయు చెలులు
వినుతించు కృతులు సత్కృతులారగా ॥శ్రీ॥

16

బ్రహ్మాండ మనెడు తొట్టి
వేదాలు పగ్గాలుగా కట్టిరి
బ్రహ్మాది దేవతలును
పట్టి ఊపిరి నింగికంపింపఁగా ॥శ్రీ॥

17

పవనుండు వీవఁదొడఁగె
అగ్ని ముకుళితహస్తుఁడై యుండఁగా
నవనాలు పూలు గురిసె
వసువు లంబఱువచ్చి పూజించిరీ ॥శ్రీ॥

18

మంగళంబులు మ్రోయఁగా
తూర్యముల్ కై వారములు సేయఁగా
రంగారు నీపర్వము
ఉంరాలిషాకవి వినుతించెను ॥శ్రీ॥

✪✪✪

సురటరాగము-ఆదితాళము

కోరివినుమ తత్వచరితము జేరి
నిజధర్మమిది మదిని మీరి
పారమార్థిక చ్యుతుఁడుశరీరి
మాయతోఁ బ్రపంచము చేరి
సారహీన సంస్కృతిలోన జారి
ప్రకృతిలోఁబడి వైరి
వారములకుఁ జిక్కి నరుఁడై
దారపుత్రులో యనుచు మూర్ఖుఁడై వారి
హితమరయుచు పరము కరిగెడు
ధారేమి నారయక యవిద్యను ॥కోరి॥

2

మట్టి వంటి తనువు
స్థిరమని
పట్టి ప్రేమ విడవు-దీని
గుట్టు తెలియలేవు - దేహము
వట్టిరోగముల నెలవు - ఇది
వుట్టి మెఱపు రీతి దోచిపోవును
ఇట్టిమాయమగుచు నొక్క త్రుటియే
పట్టదు నిక్కము నిజరూప మెఱుగలే
నట్టినరుఁ డధోగతిని బడి వి
రాట్టయిన యాత్మను వివిధగతి
గిట్ట భవసముద్రమున నిడి
నుట్టయిచని తిరిగి మర్త్యుఁడై
పుట్టును యథాస్థితి నింద్రియముల
తట్టు జేరుతన్ను తానెవండను యోగదీక్ష
నెట్టు యార్ధిక విషయవిరతి
మెట్టి స్వప్రకాశ భ్రష్టుఁడౌ తుద
ముట్టన్ జనఁడు జీవుడ హరియయి ॥కోరి॥

---

* ఇది ఆధ్యాత్మ రామాయణములో "చేరి వినవె శౌచరితముగౌరి" అనువరుస

3

కాల వశముచేత, కర్మ
కలాప భీతచేతసుఁడవై,
తేలలేక, పాతకాంబుధి
గూలి పోయితివి, ప్రేతవై
తేలి తొంటి జన్మములను గని,
బేల వై విచారపడి కడచి, యీ
లీల నిజసదనము జని గురునిగని
కీలెఱింగి చూపుదెలిసి గుణ మి
ధ్యాలాలసత్వ మణఁచి శమదమ
శీలాన్వితుఁడ వగుదు, వందే
ఫాలాగ్రంబున వేణునాద
మాలాపనంబుసేయు చక్రి, య
నాలోచిత మనస్కు లీరహస్యము
ఆలోకనేసేయ రిదెతపసు
మాలికలను ద్రిప్పుకొనిన మనసు
మాలిన్య మరుగ దెప్పుడిదె తెఱవు ॥కో॥

4

మంద బుద్ధిగాక
ఇంద్రియ
బంధములను జొఱక
మోహ
స్పందితుండు నగుచు చెడక
డిందివిషయ విహ్వలుఁడు గాక
అందరాని యమనస్కపదము మొద
లంది తృప్తిబొంది తానుతానై
యిందునందు నొక్కరీతి వెలిఁగి బ్రహ్మా
నంద పదవిగని చిత్ప్రకాశుఁడ వి
నించాత్మకుఁడు పూర్ణుఁడగుణుఁడు
వందితుండు నిగమనుతుఁడు స
నందానేక ఋషుల పోలిక
నంది జడత బాసియుండు న

మంద దివ్యసుఖము జెందు జన్మల
నందఁబోఁడు యధేచ్ఛగాఁ దిరుగు
సందియంబు లేదు ముక్తి విధమిల
కుందకను కృతార్థుఁడై చనుము ॥కో॥

5

ఆదియందు నీవె
ఆ య
నాది యందు నీవె
యిటుపై
యాదిమధ్య లయుఁడు నీవె.
నాదమై యనంత మహిమా
పాదుడై తనువు గలిగిన పోయిన
బాధితుండు గాక శిథిలఘోరప్ర
మాదమౌ యవస్థలుడిగి జ్ఞానో
పాధికుఁడ వగుచు స్వప్రకాశమతి
మోదావహము నైన తన్మయ
సాధకమున నగుపడెడు పద
చ్ఛేదం బైన ప్రతిపదార్థ మ
భేదబుద్ధి తానుగాగ వి
వాదమణఁచి యంతరాత్మ "సోహం"
పాదద్వయము జపముసేయ కృత
సాధకుండు జ్ఞానమూర్తి యెచ్చట
పాదముంచు నచ్చట స్వరాజ్యమగు ॥కో॥

6

పంచభూత మయుఁడు
ఈశ్వరుఁ
దంచు తెలియు నరుఁడు
తానదె
యంచు చెప్పగలఁడు
తనుతాఁ
గాంచి యేముఱియు నతఁడు వీ
క్షించు నీమహా యజాండభాండము
మంచుబిందువో యన పరి
కించు, సమంచితమగు చరాచరము లెద న

ర్థించి, మేఘములలోన మెఱసి వ
ర్షించి, నదీసలిలమై పర
తెంచి, కుసుమ సౌరభముల
పొంచి, ఉండు కోటిలోపల న
టుంచి, రవియై రవికంటెను
మించి, యొక్కఅణువై భువి కవత
రించి, కోకిలంబునయి వనముల ధ్వ
నించ, పాటపాడి తానె సకల మ
టంచు, నెంచు విశ్వరూపముగ ॥కో॥

7

ఈ రహస్య మిందు
దెలిసిన
వారె యోగు లందు
ముఖ్యులు
ధీరు లిందు నందు
తెలుపఁగ
గోరుచుందు రందందు
ఈ
దారి నెనసి నితరులు తరింపఁగను సొం
పారఁ దలఁచి దివ్వెదివ్వెను ముట్టి
దారుణమైన తమ సుప్రకాశమైన
తీరున పవిత్రుఁడు హరి ప్రణవా
కారుడైన ఆ ఖై లలీగురుం
డీ రాదాంత మంత ఉమ ర
లీషాకవి కొసంగె భక్తి
కారంభ విదూరులకును సం
సారాగ్ని నిమగ్నులకుఁ దెలియ
నేర దిది, యమేయ దివ్య
స్ఫారంబైన సువి
చార మతీంద్రియోరుసం
స్కార చారువేదాంత త్వార్థ వి
ద్యారాజ పదము బొందు మట ॥కోరి॥

అనుబంధము

ప్రబోధము

పైన ఆకాశంబును క్రింద నెలయుగల యీ పంచభూతాత్మక మహా ప్రపంచమునందు చీఁకటిచే కప్పఁబడి మాయా మాయాత్మకమైన మహా తమోవారాశిని శరవేగముగా కొట్టుకొనిపోవు కాలవాహినికి గురియై ఏదో అనంతా గాధమైన నిమ్న సోపానములకు దిగిపోవుచున్న యీ భయంకరమగు జీవిత సర్వస్వమునందు మానవుడు జడుడై సంక్షుభిత మనస్కుఁడై తేల్చుకొనలేని ప్రకృతి బంధములకుఁ జిక్కి తుదకు గడ్డిపరకకైన కొరకాక కామాదుల కాశ్రయమై అహంకార మమకారములకు నిలయమై విషయాల కాణాచియై పూరింపరాని తృష్ణచే తలఁబడి వగగూలి కరగి నీరైపోవుచున్నాఁడు. మట్టై యెగిరిపోవుచున్నాఁడు. అయ్యో! ఇదియేనా మానవుని పర్యవసానము? కాదు. అస్థిమాంసవసా వికారమైన మానవుడు మృత్తికారేణు సముదాయమున ప్రోగుపడిన సచేతన సనాతనాధిక దివ్యవ్యక్తి శబ్ద స్పర్శ రూప రసగంధాత్మకంబగు పంచీకరణముల మధ్య మహాతేజో విరాజితములై విలసిల్లు మేఘాలలోని మెఱుపువలె ప్రదీప్తి గాంచుచున్నను, ఆవరణ విక్షేపాత్మకమైన జడప్రకృతి కాస్పదమగు అవిద్యచే ప్రచ్ఛన్నమై, ప్రభిన్న స్వరూప నిష్పత్తిగాంచి కించిదజ్ఞత్వాది గుణ విశిష్టమై వాసనావేశితమై, నానావిధ కర్మకలాకలాప మలీమసత్వమును జెందుచున్నది.

ఇది మాటలచే, యుక్తులచే, మదములచే, వేషభూషలచే వదలునదిగాదు. అచంచల మగు మహాతపోదీక్షాదక్షమైన జ్ఞానశక్తి సాధనసంపత్తి ఆధ్యాత్మికయోగ విద్యావిమానారుఢమగు తేజస్సు నిర్వికల్పమగు నిష్ఠా నిమీలిత లోచనాంతర్గత సుషుమ్న మార్గ మహత్తర జ్వాల్యమాన మానిత ప్రభాపటలము ఏకాగ్రత, పవిత్రతర శౌచశీలాచారా వికార సుస్థిర సముపాసనోపాసిత సూనృత వ్రతమందలి లక్ష్యము లత్యంతావశ్యకములు. ఇవి లేక మెట్ట వేదాంతములు రౌరవాది నరకానలములకు దారి తీసి మాడ్చి, బూడిద గావించును.అధోగతి ముట్టించును. ప్రజలయెదుట మాయగాని పరాత్పరుని యెదుట కాదు. కూటికై కోటివిద్యలున్నను, బ్రహ్మవిద్య పవిత్ర ప్రవర్తనముపై పునాదులుపెట్టి ఉన్నది. ఆ నిగూఢ సత్యము తెలిసి, తెలివి

తెచ్చుకొని జితేంద్రియుడవై, అవాఙ్మానసగోచరమైన ఈశ్వర సాక్షాత్కారముకైన అక్కులు చాపుము. నేలఁబడినను. తిటిగి యత్నించి ప్రాకి, పడరాని కష్టములపడి పడయఁగోరుము. అప్పుడే నీ కర్మబంధము తెగును. నీ జీవరహస్యము తెలియవచ్చును. నీ మరుగు గోచరమగును. నీవు తెర కావలనున్నావు. నీ మాయ తెర ఎత్తినఁగాని, నీలోని నిజము నీకు తెలియదు. తెలియని అరిశములను తెలిసినవానివలె తెంపరివై తెగ వాగుచున్నావు. పెద్ద ఆర్భాటములు చేయుచున్నావు. ముక్త కంఠముతో దశదిశాంతముల మార్మ్రోయునట్లు గర్జించుచున్నావు. అయ్యో! నీ రక్తనాళములు బ్రద్దలై పోయినవి. నీ జీవనపుటోలములు వసివాడిపోయినవి. నీ ప్రాణములు సొమ్మసిల్లినవి. నీవు లోలోపల కుమిలిపోవుచున్నావు. మొత్తుకొనుచున్నావు. నీకు పశ్చాత్తాపము రాలేదు. భీతి జనింపలేదు. కాని నీవొక వీరునివలె రక్తసిక్తావలేపనమైన బ్రతుకులో పడి, వెర్రి వెర్రి వేదాంతము వట్టికుండవలె పాడుచున్నావు, ఆడుచున్నావు. నీ అవజ్ఞత నీవు గ్రహింపలేక పోవుచున్నావు. నీకు నీ నిజము తెలియదు. నీవు అజ్ఞానాంధకారమున నీ ఆత్మను నశింపఁజేసికొన్నావు. నీవిఁక లేవు. లేవు. ఓ పామరుఁడా లెమ్ము-మేలుకొనుము. నీవు నీవైనచోటు వెదకుము. నీ వమృతత్వమును పొందుమార్గమూహింపుము. రేపు మహాగాధ జనకమైన మృతి నీ ముంగర లంగరు వేసి నిన్నాచికొని వాయువేగమున గొనిపోవ సమకట్టియున్నది. ఆ రంగము గడచు నుపాయమాలోచింపుము. నీవు అసలు శూన్యము-నీ శూన్యములో నీవు సద్రూపాపత్తిని సంపాదింపుము. అదే అమృతము. అదే మోక్షము, అదే నీవు-అదే దారి. అదే మా ప్రబోధము. అదే గమ్యస్థానము. అదే సార్వజనీనమైన నిర్వాణము. అదే శాంతి. ఓమ్ శాంతి-శ్శాంతి-శ్శాంతిః.

ధ్యానము

ఈ భూమి ఆ సూర్యుఁడు నక్షత్రాది మహాపదార్థములన్నియు తపస్సు చేయుచున్నవి. అవి మీరు విన్న వినఁబడును. ఈ సంగతి వేదము, ఖురాను కూడ చెప్పినవి. గొప్ప గొప్ప మానసిక శక్తుల పేక్షించువారు నెత్తి నేల మోపి తపస్సు చేయుదురు. అనఁగా భూమిలోని విద్యుచ్ఛక్తి తనలో నొప్పి అనఁగా అనాహత చక్ర మాకర్షించునని భావము.

ధర్మము

సూర్యుఁడు, చంద్రుఁడు, భూమి, నక్షత్రములు, సముద్రము మున్నగు చరాచరములు మన యుపదేశ మంత్రమునే జపించుచున్నారు. వారును మీవలెనే తరించుటకు తపస్సు చేయుచున్నారు. ఆ తపస్సు మీ తపస్సులో ఖినఁగలరు.

ఉపదేశ మంత్రము యొక్క అర్థము "జ్యోతి స్వరూపమైన నీశ్వరు నెట్టయెదుట నాత్మాకృతి సాక్షాత్కరించుట కాహూయమానము" అంతర్లీనమైన సంకల్పమని యెఱుఁగవలయును.

దీక్ష

ఈ దీక్షకే సాధనమని పేరు. ఈ సాధన వాచామగోచరమైన యీశ్వరుఁడు వాని సృష్టి యొక్క రహస్యమును ఇనుపపెట్టెకుఁ దాళము వంటిది. అట్టి తాళముతో విప్పక గొడ్డళ్ళతోఁ గొట్టినట్లు కబుర్లు ధ్వనులకేగాని క్రియల కక్కరకు రావు.

ఇట్టి యీ సాధనలో సంపూర్ణస్థాన మలంకరించినవారు శ్రీ మహమ్మద్ రసూల్ ప్రవక్త. పూర్వము శ్రీకృష్ణులు మహమ్మద్‌వారు "మేరాజ్" అను పేరను శ్రీకృష్ణులు విభూతి యోగమను (భగవద్గీతలో పదియవ అధ్యాయము) పేరను తమతమ సాధనలను విశదీకరించిరి. ఇవే సాధనతత్వములోని పరమ నిగూఢములగు సూచనములు. కాని సూత్రభాష్యమువంటి మహాతత్వ గ్రంధము రచించిన శంకరస్వామి కూడ విభూతియోగమన నేమో గ్రహించలేకపోయెను.కాని రామతీర్థుని నిర్యాణము అనఁగా నాతఁడు దేవుఁడని భూమిని వాయువును అగ్నిని ఆకాశమును అహస్సును ఉషస్సులు కౌగలించుకొనఁబోవు చుండెడి వాఁడు తుదకు ఆపస్సులపై ప్రేమ పట్టలేక కౌగలించుకొనబోయి గంగలోఁబడి చనిపోయెను. దీనినిఁబట్టి యాతఁడొకింత యెఱుంగునేమోయని తోఁచెడిని, గీతలోని అసలున్న మర్మమే విభూతి యోగము. తక్కినవి వట్టి తుక్కు ఏమందురా శ్రీకృష్ణుఁడదే సాధన చేసి చేసి అనగా ప్రపంచములోని ఘనాఘన పదార్థములు నేనేయని సాధన చేసి చేసి మహాఘనుఁడై అర్జునునకుఁ విశ్వరూప సందర్శనమను పేర త్రిలోకములు జూపగలిగెను. ఇది గీతలో 11వ యధ్యాయము. విభూతి

10వ యధ్యాయము అనఁగ ఒకటి సాధన(Practice) రెండవది(Display) ప్రదర్శనము. కావున విభూతియోగము శ్రీకృష్ణుని మహాత్మ్య విశేషములే కావు. సాధన విశేషములు. అదేదారి. యిది యెవరును ఎఱుంగఁజాలకున్నారు. కాని మహమ్మదువారి"మేరాజ్" గ్రహించినవారు కొందఱున్నారు. కావుననే మహమ్మదీయ తాపసులు అత్యద్భుత మహాశక్తులు త్రుణప్రాయముగా సాధించి చూపఁ గల్గుచున్నారు.

మేరాజ్

క్రీస్తు శకము 622వ సంవత్సర ప్రాంతమున నొకనాటి రాత్రి మహమ్మద్ వారు ఆకాశ సోపానమెక్కి వెళ్ళి ఈశ్వరుని చూచి మాటలాడివచ్చి నేనీశ్వరుఁడనై ఈశ్వరునిఁ జూచినాను. "ఆల్‌రాయ తే-రబ్బి బెరబ్బీ" అని చెప్పిరి. ఆ ప్రయాణములోని విశేషములు విభూతియోగములోని భావములనే యనుకరించు చున్నవి. అనఁగా నివే పరమార్థ ద్యోతకమైన మోక్షసామ్రాజ్య సిద్ధికిఁ బ్రధాన రంగము.

ఇది తెలియనివారు మహమ్మదువారిది ఆకాశయానము, శ్రీకృష్ణుని విభూతియాకాశ పంచాంగమనుచున్నారు. కొందఱివి ఆధ్యాత్మికములను చున్నారు. అట్లనుట సరికాదు. ఇది కేవలము చరిత్రాత్మకమైన ముఖ్యోదంతములు వాస్తవములు భావమాత్రములుగావు.

మతియు నీ "సభ" అనాదిసిద్ధమైనది. సూర్య చంద్రులతోఁ బుట్టినది తిరిగి సూర్యచంద్రులతో ముగియఁగలదు.

దీనికి మూలపురుషుఁడీశ్వరుఁడు. అవతారులందఱు ప్రచారకులు. ఋషులు జిజ్ఞాసువులు. ఒక శాఖ శ్రీకృష్ణాది దశావతారములలోను, ఒక శాఖ మోసే మహమ్మదువారిలోను వచ్చినది. మొదటిశాఖ కల్క్యవతారితోను, రెండవ శాఖ "మహదీ" తోను వికాశమునకు రానున్నదని శ్రీశ్రీ అఖైలలీషా గురుస్వాములవారి ఏతచ్ఛిద్ధాంతములు కల్కి భాగవతము, ఇల్మనైర్ అను రెండు దివ్య గ్రంధములు వ్రాసి యందు ఈ సభాప్రాతిపదికాది ముముక్షధర్మములు సవిస్తరముగా వ్రాసియున్నారు.

ప్రార్థన

సకలాంతర్యామివై సకల భూతములందు లయమై సకలవస్తు స్వరూప సాక్షాత్కారముచేత నీ నిజరూపము లోకమునకు వెల్లడించు నీ వినిర్మల దివ్య తేజోవిరాజిత మహామహనీయ మార్తాండ మండలము మాచేవైపు మరలించి మా చిరకూర్చిత పూర్వకర్మ మలీమసములను చీకటిని బరిమార్చి స్వచ్ఛమును కళంకరహితంబును మిక్కిలి పవిత్రీ భూతమును నైన నీ విజ్ఞానము నీ నిజారాధనము నీ ప్రపత్తి మాకు ప్రత్యూషము ప్రసాదించుము స్వామి. మేము పామరులము, దీనులము, తెలివిలేనివారము – నీ అపార పారావార సదృశమైన దయావృష్టి మా పై కురిపి మమ్ము నీ వైపు మరలించి మా దృక్కులను కేంద్రీకరించి మాకెప్పటికిని కరిగిపోవని నీ భాగ్యమును, లక్ష్యమును, నీ నిష్ఠను, నీ ధ్యానమును, ఏకాగ్రతను ప్రసాదించుము తండ్రీ మమ్మల్ని విధాల కాపాడుము రక్షించుము నిన్నే మేము శరణ్యము వేడుచున్నాము, నిన్నే మోము గతియని భావించుచున్నాము, స్వామి! ఈశ్వరా! తండ్రీ! కరుణించుము. నీకు మనస్సులు.

✪✪✪

ఓ స్వామీ! నీవు అనంతుడవు. అప్రతిహతుడవు. అతీంద్రియుడవు. ఆకాశాది పంచమహాభూతంబులను, సూర్యచంద్రాది నక్షత్ర మండలములను, దిగ్దిగంత బ్రహ్మాండభాండంబులను, సచరాచర భూత కోటిని, సృష్టించి మహాపదార్థములలో నిండి నిబిడీకృతమై, యన్నిటికి సాక్షివై నీవే ప్రకాశించుచున్నావు.

స్వామీ! నీవు ఈశ్వరుడవు. సచ్చిదానంద స్వరూపుడవు. సగుణ నిర్గుణాత్మక పరబ్రహ్మ చైతన్య మహా తేజోవిరాజితుడవు. నిన్నెరుంగుట కెవరికి సాధ్యంబుగాదు. ఎవరికి గోచరంబుగాదు. స్వామీ! నీయందీ యనంతాకాశంబును, ఈ చతుర్దశభువన బ్రహ్మాండ భూతకోటియు, రేయింబవళ్ళతో గూడిన కాలవాహినీ సతంబులును, దేవదానవాది మర్త్యకోటియు, దివియును. అమృతంబును, ఆదిత్యుండును, ఆదిమధ్యాంతర లయంబగు శూన్యంబును. సద్రూపాత్మకమైన తేజస్సును, సాంధ్యాదిప్రభాత భాసుర పరమ, మహామహిమా పదార్థంబులును, యోగవిజ్ఞానాది యజ్ఞపురుష స్వరూపంబులును, అగ్నియు, ఆపస్సును, వాయువాది సూక్ష్మాతిసూక్ష్మతరేణు సముదాయంబును సర్వంబును, అణగి మణగి నిగూఢమైన

నీయందు రూఢమగుచున్నవి. తండ్రీ! జగజ్జ్యోతి స్వరూపుడవైన నీవే, సమస్త భూతజాలముల యందు కేవల మంతర్లీనమై, అభూత భావిభావద్యోతకమై, అమలమై కలుషాపహమై సావరజంగమాత్మకమై, మా యందు ప్రవేశించుము. తండ్రీ! మాకు నీ నిజరూపము, నీ యథార్థమైన వెలుగు, నీ యగాధమైన సత్యము, నీ పరతత్వము, నీ యసంగతమైన, దేదీప్యమానే మానితమైన తేజస్సు, సాక్షాత్కరింపుము స్వామీ! సదసత్పదార్థముల కవ్వలై, మాయ కతీతమై బ్రహ్మాండాది భువన విరాజమానమైన నీ తేజస్సు, నీ నిష్కళంకమైన, నిరీహమైన, నిష్ప్రతియోగికమైన, నీవిన్నాణము, నీ సోయగము, నెలయందు వెన్నెలయై, దిక్కులందు రూఢమై పాతాళంబుల దూరి-నభములపై కెగసి, అంతరాళముల భేదించి-పంచభూతాత్మకమైన ప్రకృతిని దాటి చీకటిని గడచి-వెలుగులో వెలుగై - నభముపై నభమై-శూన్యములో గలిసి శూన్యమై శాంతిస్వరూపమున విరాజిల్లు నీవు నీ మహిమాస్పద సర్వశక్త్యాత్మక పవిత్ర తేజస్సు - ఆ వినిర్ముల వికాస విశ్వరూపము - ఆ నిరీహ నిష్కళంక - నిరవద్య - నిష్ప్రతి యోగిక - నిరాలంబ నిత్య సత్యప్రత్యగభిన్న పరమాత్వ తత్వము - నీ అసదృశ ఆవాచ్య - అసామాన్య అనూనాధిక మహా గంభీరాకారము - నీ పవిత్ర ప్రపుణ్య దివ్యగాత్రము - నీ కళ్యాణ గుణగణ ప్రభాభాసితము మా కెరింగింపుము తండ్రీ!

మృద్దారు శిలాపరివేష్టిత నామరూపాత్మక విశ్వ విశ్వంభరాచ్ఛిన్న అభిన్న ప్రతిపాదక ప్రకృతి కవ్వలనున్న నేకాకృతివగు నీవు సుజల జలనిధి వ్యామోహిత, తరంగమాలికాంతర్లీన ప్రణవైక సుధాగాన నముపానోపానిత తుషారపరంపరలయందు నీవు, నిరలంకృత విభీత సంక్షుభిత నితాంత మహోపద్రవ పాతాళ నిమగ్నసోపాన పంక్తిలో నీవు, ధగద్ధగిత జాజ్వల్యమాన మహాభీభత్స భగ్నాగ్ని మండల మధ్యావకాశ ప్రభాపటల ప్రదేశ విహార విలాస లాలన విలసదసమాన ప్రళయ జంఝామారుతముల యందు నీవు, నిమీలిత ప్రసవ సువాసనావాసిత గంధవహ కదంబములపై నెక్కి తొక్క లల్లార్చి నేర్చిన గీతికా ప్రకాండము లాకాశావృత నిశాకన్యకా నీల నీరద సన్నిభ చేలాంచలముల జారు దగ్ధ తమస్సముదాయము పటాపంచలు గావించు నుషాదేవి కర్ష్ణమిచ్చు పక్షుల వాక్కులయందు నీవు, ఈశసూత్ర విరాట్‌వేషాది యక్షరాక్షస మరుదింద్రాగ్నివిష్ణు, భైరవ మైరాళమాది మహాఘోర ఘనదేవతలయందు నీవు, స్నిగ్ధ ధూళిధూసర

సంమిళిత దిగంతవిశ్రాంత ధూమకేతు నిపాత ప్రచలిత ప్రమాణ పరికర పరంపరలయందు నీవు, నీవులేని నిలయము – నీవులేని స్థితి – నీవు లేని రక్షణలేదు.

నీ తలపై చుక్కలు తలంబ్రాలు జల్లుచున్నట్లున్నవి. మందమలయ మారుతములు వీవనలు విసరుచున్నట్లున్నవి. రేయింబవళ్ళు, సూర్యచంద్రులు హారతి పళ్లెములై నీరాజనము లిచ్చుచున్నట్లున్నవి. మేఘగరారావములను మృదంగములు కాలనాథుడు మీటుచుండ ప్రకృతి కన్య దిక్కుంభికుంభములపై నెక్కి గజ్జెలందెలు ఘళ్ళు, ఘళ్ళుమని మ్రోయ నాట్యపాటవము జూపుచు నీ నామము శ్రవణ శ్రావ్యముగ నెలుగెత్తి ముక్త కంఠమున నుడుపుచు మోళ్ళను చిగురింపచేయు చున్నది. ఆహా! మేము నీ సహజ సౌందర్యములోని యొక నెరసైన, నొక్క అణువైన, ఒక్కలేశమైన నెఱుగముగదా! చూడలేముగదా! వినలేము గదా! స్వామీ ! నీ నెలవు, నీ నిజరూపము, నీవినిర్మల విశాల విద్యా ప్రపంచ సౌభాగ్యము, నీ కాంతి, నీ ప్రతిభా ప్రపుణ్య లావణ్య మహావారాశి, నీ ధామము, నీ నియుక్త నికేతనము, నీ ఋజుమార్గము మాకగుపర్చుము స్వామీ! నీవు మా అజ్ఞానాందకార విరచిత కలుషజాలములకు కర్మసాక్షివై, నానావిధ కోప తాప తమో మలీమస మహా సముద్రము దాటించు నావవై, కర్ణధారుడవై ఎడతెగని తాపత్రయ దురంత దుఃఖ ముఖ దురుద్యోగ నికాయములను రూపుమాపు సిద్ధాంజనమువై, బాసటవై, బంధువై, ఆప్తుడవై, అన్ని విధాల తోడ్పడుము తండ్రీ!

మేము సంసార మహా గాఢాంధకార మాయార్ణవంబున మునిగి, విగళితమై, పతితమై, గమ్యమాన మనస్సంధానులమై, నిరవకాశ నితాంత తమస్సంస్మృతిని బడి, దారి గానలేక నీ కరుణకై నీ కటాక్షవీక్షణములకై వేచి, నీకై దోసిలొగ్గి నీ యాశీస్సును గోరి పడియున్న, నిరీక్షించుచున్న మమ్ము, మా సంతతిని కాపాడుము, తండ్రీ! నీవు కరుణాళువు, దయాళువు, దీనరక్షకుడవు, దేవాదిదేవుడవు స్వామీ! నీవే మాకు దిక్కు. నీవే మా శరణ్యము. నీవే మాకు జీవిత సర్వస్వము. నీకు మా నమస్సులగునుగాక! రక్షింపు తండ్రీ!

ఈశ్వరుఁడు

తే. గీ. అవని సృజియించినట్టి వి ♦ శ్వాత్మకుండు
మానవులకన్ని ఎడల తో ♦ డ్పడెడువాఁడు
ఊహలకు నందనట్టి మ ♦ హోన్నతుండు
ఈశ్వరుఁడు మాకు నెప్పుడు ♦ హితము గూర్చు

తే.గీ. పంచభూతంబు లెవ్వాని ♦ వాసగృహము
పరగ నక్షత్రలోక మె ♦ వ్వాని పథము
భానుచంద్రు లెవ్వనియాజ్ఞ ♦ బాయకుంద్రు
అతని నీశ్వరు సేవింతు ♦ ననవరతము

తే.గీ. రాత్రియందున నెలవెల్లు ♦ గ్రాలజేసి
పగటి యందున భానుని ♦ పంపి యెల్ల
జంతు జాలంబులను గాచు ♦ సర్వమయుఁడు
నీశ్వరుఁడు మాకు దోడ్పడు ♦ విశ్వమందు

తే.గీ. ఆకు పచ్చని కొమ్మకు ♦ నందమైన
నెట్టని సుమంబు కల్పించు ♦ నెమ్మెకాఁడు
శుక్తిగర్భాన ముత్యాలు ♦ జొనుపు నట్టి
ఈశ్వరుండిచ్చు మాకు న ♦ భీష్టసిద్ధి.

నమస్తే! నమస్తే! నమః

శ్రీ ఉమర్ ఆలీషా గ్రంధమండలి

పిఠాపురం - 533 450

1. శ్రీ మహమ్మదు రసూలువారి చరిత్ర
2. దానవవధ
3. మహాభారత కౌరవ రంగము (నాటకం)
4. సూఫీ వేదాంతదర్శము
5. అనసూయ (నాటకం)
6. కళ
7. ప్రభాత కథావళి (కథలు)
8. విషాద సౌందర్యము
9. విచిత్ర బిల్హణీయము
10. బ్రహ్మ విద్యావిలాసము
11. స్వర్గమాత (కందార్థములు)
12. తత్వసందేశము
13. పరతత్వ కీర్తనలు
14. చంద్రగుప్త (నాటకం)
15. ఉమర్ ఖయ్యామ్
16. మణిమాల (నాటకం)
17. శాంత
18. ఖండకావ్యములు
19. బర్హిజీదేవి
20. పద్మావతి (నవల)
21. సాధనపదము
22. షాతత్వము (బ్రహ్మర్షి హుసేన్ షా సద్గురువర్యులు)
23. తత్వప్రబోధము (బ్రహ్మర్షి మొహిద్దీన్ బాదుషా)
24. తత్వజ్ఞానము మాస పత్రిక